నమస్తే తెలంగాణ

యాదాద్రి భువనగిరి

I | హైదరాబాద్, మంగళవారం 1 ఏప్రిల్ 2025 | YADADRI BHUVANAGIRI

నడుస్తున్న కారులో మంటలు

మంటల్లో కాలిపోతున్న కారు

నార్కట్‌పల్లి, మార్చి 31 : నడుస్తున్న కారులో సాంకేతిక లోపంతో మంటలు చెలరేగి పూర్తిగా దగ్ధమైన సంఘటన నల్లగొండ జిల్లా నార్కట్‌పల్లి మండలంలోని చెర్వుగుట్టు గ్రామ శివారులో సోమవారం సాయంత్రం చోటు చేసుకుంది. ఎస్సై క్రాంతికుమార్ తెలిపిన వివరాల ప్రకారం హైదరాబాద్‌కు చెందిన శివకుమార్, గోవర్ధన్, శివ ముగ్గురు వ్యక్తులు నూతనంగా తీసుకున్న రేంజ్ రోవర్ కారులో గుంటూరు నుంచి హైదరాబాద్ వెళ్తుండగా మార్గమధ్యంలో అద్దంకి-నార్కట్‌పల్లి దహదారిపై చెర్వుగట్టు శివారులో ఒక్కసారిగా మంటలు వచ్చాయి. దీంతో అప్రమత్తమై వెంటనే కారును ఆపి దిగారు. మంటలు విపరీతంగా రావడంతో కారు పూర్తిగా దగ్ధమైంది. ఫైర్ సిబ్బంది వచ్చేటప్పటికీ పూర్తిగా కాలిపోయింది. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

సూర్యాపేటలో మీడియాతో మాట్లాడుతున్న మాజీ మంత్రి, ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డి, పక్కన మాజీ ఎంపీ బడుగుల లింగయ్యయాదవ్

రైతు భరోసా సగానికిలోపే..

రేవంత్‌రెడ్డి చెప్పిన గడువు పూర్తి

అమలు కాని సీఎం హామీ

- ఉమ్మడి జిల్లాలో 2 నెలల్లో 4 ఎకరాల వరకే..
- రూ.1,560 కోట్లగానూ నేటికి రూ.788 కోట్లే విడుదల
- ఇంకా సగానికిపైగా విస్తీర్ణానికి పడని డబ్బులు
- నిత్యం రైతుల ఎదురుచూపులు
- కోతలు పూర్తవుతున్నా అందని పెట్టుబడి సాయం
- ప్రభుత్వ తీరుపై మండిపడుతున్న రైతాంగం

నల్లగొండ ప్రతినిధి, మార్చి31(నమస్తే తెలంగాణ): ఈ ఏడాది మార్చి 31 వరకు అర్హులైన ప్రతి రైతుకు ఎకరాకు 6వేల రూపాయల చొప్పున రైతుభరోసాను అందించి తీరుతాం' అని సీఎం రేవంత్ రెడ్డి స్వయంగా గత జనవరి 26 న పైలెట్ గ్రామాల్లో పథకాలను ప్రారంభిస్తూ అట్టహాసంగా ప్రకటించారు. కానీ వాస్తవంలో ఆగుతూ సాగుతూ అన్నట్లుగా రెండు నెలల ఐదు రోజుల్లో నాలుగు విడుతల్లో కేవలం నాలుగు ఎకరాల విస్తీర్ణం వరకు ఉన్న రైతులకు మాత్రమే రైతుభరోసా డబ్బులు ఖాతాల్లో జమయ్యాయి. సగం మందికి పైగా రైతులు రైతుభరోసా కోసం నిత్యం ఎదురుచూస్తూనే ఉన్నారు. ఫోన్ కు ఏదైనా మెసేజ్ వచ్చిన ప్రతీసారి రైతు భరోసా డబ్బులు పడ్డాయేమోనన్న ఆశతో చెక్ చేస్తుంటే నిరాశే ఎదురవుతున్నది. వరంగల్ రైతు డిక్లరేషన్, ఎన్నికల మ్యానిఫెస్టోలో చెప్పిన ఏడాదికి రూ.15వేల రైతుభరోసా హామీని తుంగలో తొక్కుతూ రూ.12వేలు మాత్రమే ఇస్తానని చేసిన ప్రకటన కూడా ఆచరణకు నోచడం లేదు. గత వానకాలం సీజన్ అనర్హుల ఏరివేత పేరుతో అభిప్రాయాలు, చర్చలు, సర్వేలు అంటూ కాలయాపన చేస్తూ మొత్తానికే డబ్బులు ఎగొట్టిన విషయం తెలిసిందే. ఇక యాసంగి నుంచి ఎకరాకు రూ.6వేలు మాత్రమే ఇస్తామని చెప్పి, అది కూడా మార్చి చివరి నాటికి పూర్తి చేయలేదు. ఈ ఏడాది జనవరి 26 నుంచి రైతుభరోసాతోపాటు ఇందిరమ్మ ఇండ్లు, రేషన్ ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకాలకు ప్రభుత్వం లాంఛనంగా శ్రీకారం చుట్టింది. ముందుగా మండలానికి ఒక పైలెట్ గ్రామాన్ని ఎంపిక చేసి అక్కడ వందశాతం గ్రౌండింగ్ పూర్తి చేస్తామని ప్రకటించారు. ఆ గ్రామాల్లో మాత్రం అందరికీ రైతుభరోసా వేసినట్లు చేశారు. మిగతా గ్రామాల్లోని రైతులకు అప్పటి నుంచి ఎదురుచూపులు తప్పడం లేదు. ఆ సందర్భంగానే రాష్ట్రంలోని సాగుయోగ్యమైన ప్రతి ఎకరాకూ మార్చి 31లోగా రైతుభరోసా డబ్బులు పూర్తిగా చెల్లిస్తామని సీఎం రేవంత్ ఆర్భాటంగా ప్రకటించారు. కానీ ఇప్పటి వరకు ఉమ్మడి నల్లగొండ జిల్లా పరిధిలో నాలుగు ఎకరాల విస్తీర్ణం వరకు ఉన్న రైతులకు మాత్రమే రైతుభరోసా డబ్బులు పడ్డాయి. మిగతా సగం మందికి పైగా రైతులకు ఎప్పటివరకు పెట్టుబడిసాయం పడుతుందనేది అంతుచిక్కని రహస్యంగా మారింది.

నాలుగు విడుతల రైతుభరోసా ఇలా...

జిల్లా	నల్లగొండ	సూర్యాపేట	యాదాద్రి భువనగిరి	మొత్తం
రైతుల సంఖ్య	4,33,843	2,44,423	1,68,354	8,46,620
విస్తీర్ణం (ఎకరాల్లో...)	6,98,692	2,81,519	2,27,899	12,08,110
నగదు జమ(రూ.కోట్లల్లో)	419.21	232.92	136.73	788.86

ఉమ్మడి జిల్లాలో 26 లక్షల ఎకరాలు

ఉమ్మడి నల్లగొండ జిల్లాలో రైతుభరోసా అందాల్సిన భూమి విస్తీర్ణం సుమారు 26లక్షల ఎకరాల వరకు ఉన్నట్లు అంచనా. దీనికి సంబంధించి రైతుల సంఖ్య 11 లక్షలకు పైగా ఉన్నట్లు వ్యవసాయ శాఖ లెక్కలు వెల్లడిస్తున్నాయి. వీరికి సుమారుగా రూ.1,560 కోట్ల వరకు రైతుభరోసాగా అందాల్సి ఉంది. కానీ ఇందులో సగం మాత్రమే పూర్తయింది . సీఎం చేసిన ప్రకటన ప్రకారం సోమవారం నాటికే పూర్తి స్థాయిలో రైతుభరోసా డబ్బులు రైతుల ఖాతాల్లో జమకావాల్సి ఉంది. కానీ ఇప్పటి వరకు నాలుగు విడతలుగా వీటిని జమ చేస్తూ వచ్చారు. కేసీఆర్ సర్కార్ హయాంలో చివరి సారిగా 2023 వానకాలంలో రైతుబంధును అమలు చేశారు. అది వరుసగా 11వ సీజన్ రైతుబంధు కావడం విశేషం. ఆ సమయంలో ఉమ్మడి జిల్లాలో సుమారు 26లక్షల ఎకరాలకు సంబంధించిన 10.80 లక్షల మంది రైతులకు రూ.1,250 కోట్లను పెట్టుబడి సాయంగా అందించారు. అదే ఏడాది ఎన్నికల సమయంలోనూ యాసంగి రైతుబంధు అమలుకు కేసీఆర్ ప్రభుత్వం సిద్ధం కాగా కాంగ్రెస్ నేతలు అడ్డుకున్న విషయం తెలిసిందే. ఇవే డబ్బులను కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక ఎకరాకు అదే ఐదు వేల చొప్పున తప్పనిసరి పరిస్థితుల్లో ఇచ్చారు.

మిగతా వారికి ఎప్పుడో...

వాస్తవంగా నాలుగు ఎకరాల్లోపు రైతులకు కేసీఆర్ సర్కార్ హయాంలో తొలి నాలుగు రోజుల్లోనే రైతుబంధు డబ్బులు పడేవి. రోజుకో ఎకరం చొప్పున పదిహేను ఇరవై రోజుల్లోనే రైతులందరికీ రైతుబంధు డబ్బులు టకటకా ఖాతాల్లో జమయ్యేవి. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం జనవరి 26 నుంచి మొదలు పెట్టినా 2 నెలల ఐదు రోజుల్లో నాలుగు విడుతలుగా నాలుగు ఎకరాల రైతుల వరకు మాత్రమే భరోసా డబ్బులు జమ చేసింది. ఇక మిగతా రైతుల సంగతి ఏంటనేది అర్థం కాని విషయం. సీఎం రేవంత్ చెప్పిన గడువు సోమవారంతో ముగియగా చివరి రైతు వరకు భరోసా డబ్బులు పడాలంటే మళ్లీ వానకాలం వరకు ఆగాల్సిందేనా అన్న సందేహాలు వ్యక్తం అవుతున్నాయి. ప్రభుత్వ నాన్చివేత ధోరణిపై రైతులు తీవ్రంగా మండిపడుతున్నారు. నాట్ల సమయంలో ఇవ్వాల్సిన పెట్టుబడి సాయం కోతలు పూర్తవుతున్నా పూర్తి చేయకపోవడం రైతులను మోసం చేయడమేనని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

వచ్చింది రూ.788.86 కోట్లు మాత్రమే..

ఉమ్మడి జిల్లాలో నాలుగు విడుతల్లో ఇప్పటి వరకు నాలుగు ఎకరాల విస్తీర్ణం వరకు మాత్రమే డబ్బులు జమ చేయగా సోమవారం నాటికి రూ.788.86 కోట్లు రైతుల ఖాతాల్లో పడ్డాయి. ఇంకా రూ.800కోట్ల వరకు భరోసా డబ్బులు రైతులకు అందాల్సి ఉంది. వ్యవసాయశాఖ లెక్కల ప్రకారం... నల్లగొండ జిల్లాలో ఇప్పటివరకు రూ.419.21 కోట్ల రైతుభరోసా మాత్రమే రైతుల ఖాతాలకు చేరింది. ఇంకా రూ.300 కోట్లకు పైగా పెండింగ్ ఉన్నట్లు వ్యవసాయ శాఖ తెలిపింది. జిల్లాలో మొత్తం 4.33 లక్షల మంది రైతులకు చెందిన 6.98లక్షల ఎకరాల భూమికి మాత్రమే భరోసా డబ్బులు పడ్డాయి. ఇక యాదాద్రి భువనగిరి జిల్లాలో మొత్తం 2.81లక్షల మంది రైతులు ఉండగా, వారికి సుమారు రూ.300 కోట్ల వరకు రైతుభరోసా డబ్బులు పడాల్సి ఉంది. ఇప్పటివరకు 1.68లక్షల మంది రైతులకు చెందిన 2.27లక్షల ఎకరాల భూమికిగానూ రూ.136.73 కోట్ల రూపాయలను జమ చేశారు. సూర్యాపేట జిల్లాలో మొత్తం 3.03లక్షల మంది రైతులకు గానూ రూ.376.89 కోట్ల రూపాయలు చెందాల్సి ఉంది. కానీ ఇప్పటివరకు 2.44లక్షల మంది రైతులకు సంబంధించి 3.88లక్షల ఎకరాలకు గానూ రూ.232.92 కోట్లు మాత్రమే రైతు భరోసా అందింది.

సీఎం రేవంత్‌రెడ్డివన్నీ అబద్ధాలే

- మోసపూరిత హామీలతో కాంగ్రెస్ పాలన
- కాళేశ్వరాన్ని అప్పగిస్తే మూడు రోజుల్లో నీళ్లిస్తామన్న సవాల్‌కు స్పందన లేదు
- ఇప్పటికే రెండు పంటలు పోయాయి.. వచ్చే సీజన్ కూడా ఎండబెట్టే కుట్రలు
- మాజీ మంత్రి, ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి

సూర్యాపేట, మార్చి 31 (నమస్తే తెలంగాణ): సీఎం రేవంత్‌రెడ్డి అబద్ధాల పునాదులపై రాష్ట్రంలో పాలన సాగిస్తున్నారని మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి మండిపడ్డారు. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ మోసపూరిత మాటలను నమ్మిన ప్రజలు అధికారం ఇచ్చారని, అయితే ఏడాదిన్నర పాలన పూర్తి కావొస్తున్నా రేవంత్‌రెడ్డి సర్కార్ మూర్ఖపు ఆలోచనలతోనే నడుస్తుందని విమర్శించారు. ముఖ్యమంత్రి పద్ధతి, వాడుతున్న భాషే ఆయనను బొందపెడుతాయని ధ్వజమెత్తారు. ఈ మేరకు సోమవారం జిల్లా కేంద్రం సూర్యాపేట జిల్లా కేంద్రంలో ఆయన మీడియాతో మాట్లాడారు. సోనియాగాంధీ ఆరు గ్యారెంటీలను నమ్మి ప్రజలు మోసపోయారు తప్ప రేవంత్‌రెడ్డి మూర్ఖపు మాటలకు కాదని పేర్కొన్నారు. ఆదివారం హుజూర్‌నగర్‌లో నిర్వహించిన సభలో మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌పై విమర్శలు చేయడమే కాకుండా పచ్చి అబద్ధాలు ఆడారని అన్నారు. రేవంత్ సర్కార్ చిన్న సాకుతో కాళేశ్వరాన్ని పండబెట్టి గత రెండు సీజన్లలో రైతుల పంటలను ఎండబెట్టిందని, ప్రాజెక్ట్‌ను తమకు అప్పగిస్తే కేవలం మూడు రోజుల్లో నీటిని ఇస్తామని చెప్పినా ప్రభుత్వం నుంచి ఎలాంటి స్పందన లేదని తెలిపారు. ఎన్‌డీఎస్‌ఏ(నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ) సాకుతో కాళేశ్వరం నీళ్లు రాకుండా అడ్డుకుంటున్నారని, కేసీఆర్‌పై కోపంతో పంటలను ఎండబెట్టడం దుర్మార్గమన్నారు. వచ్చే వ్యవసాయ సీజన్‌కు కూడా నీళ్లివ్వాలనే ఆలోచన కాంగ్రెస్ ప్రభుత్వానికి లేదని తేటతెల్లం అవుతుందని పేర్కొన్నారు. కన్నెపల్లి పంప్‌హౌస్ బాగానే ఉందని అధికారులు చెబుతున్నారని, అయినా నడిపించే సోయి ప్రభుత్వానికి లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. మరోపక్క ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు నిబంధనలను తుంగలో తొక్కి నీళ్లు తీసుకుపోతుంటే ఇక్కడి ప్రభుత్వానికి సోయి లేకుండా పోయిందని అన్నారు. ఉమ్మడి ఏపీలో మాదిరిగానే రాష్ట్రంలో రైతులకు మళ్లీ కష్టాలు మొదలయ్యాయని, రైతులు కన్నీటితో ప్రభుత్వంపై శాపనార్థాలు పెడుతున్నారని పేర్కొన్నారు. పూర్తిస్థాయిలో రుణమాఫీ చేయలేదని, రైతు భరోసా ఇవ్వలేదని.. ఇలా ప్రతిదీ మభ్యపెట్టి మోసం చేస్తున్నారని మండిపడ్డారు. బోనస్ ఇవ్వాల్సి వస్తుందని అసలు పంటలనే కొనడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌పై విషం కక్కి ప్రజాక్షేత్రంలో బతకడం సాధ్యం కాదన్నారు. ఇంకా మూడున్నరేళ్లు అధికారంలో ఉంటారని తెలిసి కూడా కాంగ్రెస్ ప్రభుత్వ తీరును ప్రజలు భయపడకుండా ఎండగడుతున్నారని అన్నారు. ఎక్కడా నీ గురించి నీవు ఒక్కరోజు కూడా మాట్లాడుకోవడం లేదు కానీ కేసీఆర్ గురించి మాట్లాడనిదే నీకు పూట గడవడం లేదని రేవంత్ తీరుపై మండిపడ్డారు. ప్రజలు తిరుగబడితే ప్రభుత్వాలు ఎలా కూలిపోయాయో పక్క దేశాలను చూస్తే తెలుస్తుందని హితవు పలికారు. ఇప్పటికైనా పద్ధతి, భాష మార్చుకొని హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు.

కనీసం ఒక్కతడికి నీళ్లిచ్చినా పెట్టుబడి వస్తుంది..

పంటల సాగుకు ముందే నీళ్లివ్వమంటే రైతుల పొలాలు వేసుకోరని, కానీ నాడు ఇస్తామని చెప్పి నేడు నీళ్లు ఇవ్వకపోవడంతో రైతులు వేలాది ఎకరాలు నష్టపోయారని జగదీశ్‌రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ఒక్క తడికి నీళ్లు ఇస్తే కనీసం పెట్టుబడి ఖర్చు అయినా తిరిగి వస్తుందని పేర్కొన్నారు. అదేవిధంగా ధాన్యం కొనుగోళ్లపై వెంటనే ప్రకటన చేయాలని డిమాండ్ చేశారు. వచ్చే సీజన్‌లో పంటలను సాగు చేసేందుకు, కాళేశ్వరం కొనసాగింపునకు మరో ఉద్యమం చేయాల్సిన సమయం ఆసన్నమైందని, రైతులు మేల్కొని ముందుకు రావాలని పిలుపునిచ్చారు.

మీడియాతో మాట్లాడుతున్న బీఆర్ఎస్ యాదగిరి గుట్ట మండలాధ్యక్షుడు కర్రె వెంకటయ్య

కేసీఆర్ వద్దకు పాదయాత్రగా...

- నాలుగున యాదగిరిగుట్ట నుంచి ఎర్రవెల్లిలోని నివాసానికి..
- బీఆర్ఎస్ అధినేతను కలువనున్న పార్టీ ఆలేరు నియోజకవర్గ శ్రేణులు, రైతులు
- పాదయాత్రను ప్రారంభించనున్న మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి
- మళ్లీ కేసీఆర్ సర్కారు రావాలని కోరుతున్న జనం
- బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు కర్రె వెంకటయ్య

యాదగిరిగుట్ట, మార్చి 31 : రాష్ట్రంలో రేవంత్ పాలన గాడితప్పి రైతులు, మహిళలు, యువత అరిగోస తీస్తున్నారని, మళ్లీ కేసీఆర్ సర్కారు వస్తేనే సమస్యలు పరిష్కారమవుతాయని కోరుకుంటున్నారని బీఆర్ఎస్ పార్టీ మండలాధ్యక్షుడు కర్రె వెంకటయ్య అన్నారు. ఆ మేరకు ఏప్రిల్ నాలుగున బీఆర్ఎస్ పట్టణ యువజన నాయకులు ముక్కర్ల సతీశ్, ఆవుల సాయియాదవ్ ఆధ్వర్యంలో యాదగిరిగుట్ట నుంచి ఎర్రవెల్లిలోని కేసీఆర్ నివాసానికి సుమారు వెయ్యి మంది రైతులు, యువతతో పాదయాత్రగా వెళ్లనున్నట్లు తెలిపారు. పట్టణంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో సోమవారం మీడియాతో ఆయన మాట్లాడారు. లక్ష్మీ నరసింహ స్వామికి పూజలు చేసి వైకుంఠ ద్వారం వద్ద పాదయాత్రను మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే గొంగిడి సునీత, డీసీసీబీ మాజీ చైర్మన్ గొంగిడి మహేందర్ ప్రారంభిస్తారని చెప్పారు. రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి కేసీఆర్‌ను కలిసి నియోజకవర్గంలో ఏర్పడిన కరువు పరిస్థితులు, యాదగిరిగుట్ట లక్ష్మీ నరసింహస్వామి ఆలయంలో జరుగుతున్న అవినీతి, అక్రమాలను వివరిస్తామని తెలిపారు. రూ.2 వేల కోట్లతో యాదగిరిగుట్ట ఆలయాన్ని ప్రపంచమే అబ్బురపడే విధంగా కేసీఆర్ పునర్నిర్మించారన్నారు. స్వామివారి దివ్య విమానగోపురాన్ని 120 కేజీల బంగారంతో స్వర్ణమయం చేయాలని సంకల్పించి.. కేసీఆర్ తో పాటు ఇతర బీఆర్ మంత్రులు, దాతలు సమారు వంద కిలోల బంగారం సమర్పించారని పేర్కొన్నారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం, ఈఓ భాస్కర్ కలిసి కేవలం 10 కిలోల బంగారమే వచ్చిందని చెప్పి 50 కిలోల బంగారాన్ని స్వామివారి ఖజానా నిధులను సేకరించి కొనుగోలు చేసి 60 కిలోలతో విమానగోపురాన్ని బంగారు తాపడం చేయించారని తెలిపారు. ఇప్పటి వరకు విరాళాలకు సంబంధించిన వివరాలు వెల్లడించడం లేదన్నారు. ఈఓ భాస్కర్ రావు ఒక్కరే వెళ్లి బంగారం కొనుగోలు చేసినట్టు చెప్పడం అనుమానాలకు తావిస్తోందన్నారు. దీనిపై వెంటనే విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో యాదగిరిగుట్ట ఆలయం అధ్వానంగా మారిందన్నారు. భక్తులకు పట్టించుకునే నాథుడే కరువయ్యారన్నారు. ఆ పార్టీ ఎమ్మెల్యే, ఎంపీ కలిసి పీఆర్ వ్యవస్థను ఏర్పాటుచేసి భక్తులను దోచుకుంటున్నారని ఆరోపించారు. కొండపైన పెండింగ్ ఉన్న 10 శాతం పనులు ఎక్కడివక్కడే ఉన్నాయన్నారు. బడ్జెట్ లో దేవస్థానానికి ఒక్క రూపాయి కూడా కేటాయించకుండా స్వామివారి ఆదాయాన్ని దోచుకుంటున్నారని మండిపడ్డారు. కాంగ్రెస్ పార్టీకి ఓటేసి తప్పు చేశామని ప్రజలు బాధ పడుతున్నారని, సాగు నీరు, కరెంటు లేక పంటలు ఎండి రైతులు ఏడుస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో ప్రజలంతా మరోసారి కేసీఆర్ నాయకత్వాన్ని కోరుకుంటున్నారని, ఇదే విషయాన్ని కేసీఆర్‌కు వివరించేందుకు రైతులు, యువతీ యువకులు సిద్ధంగా ఉన్నారని తెలిపారు. సమావేశంలో ఆలేరు మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ గడ్డమీది రవీందర్, బీఆర్ పట్టణ సెక్రటరీ జనరల్ పాపట్ల నరహరి, యువజన విభాగం అధ్యక్షుడు ముక్కర్ల సతీశ్, నాయకులు కోన్యాల నర్సింహారెడ్డి, గుండ్లపల్లి వెంకటేశ్, అశోక్, శారాజీ రాజేశ్ యాదవ్ పాల్గొన్నారు.

ఇంటర్ మూల్యాంకనంలో ఇష్టారాజ్యం!

- విధుల నిర్వహణలో నిబంధనలు పట్టని సీఈ, ఎస్ఈ
- సీనియర్లను కాదని జూనియర్లకు విధులు.. మౌలిక వసతులు కరువు
- తాజాగా బోర్డు అధికారులకు ఓ అధ్యాపకుడి ఫిర్యాదు

రామగిరి, మార్చి 31: నల్లగొండలో ఇంటర్మీడియట్ మూల్యాంకనంలో కొందరు అధికారులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారన్న విమర్శలు వస్తున్నాయి. ఇప్పటికే ప్రారంభమైన మూల్యాంకనం విధుల్లో జూనియర్లకు అందలం వేస్తూ.. సీనియర్లకు ప్రాధాన్యం ఇవ్వడం లేదని తెలుస్తున్నది. మూల్యాంకనం కేంద్రంలో ఓ సబ్జెక్టు వద్ద(చీఫ్ ఎగ్జామినర్(సీఈ), ఎస్ ఈ సబ్జెక్ట్ ఎక్స్‌పర్ట్ అందుబాటులో ఉండడం లేదని, మిగిలిన సబ్జెక్టుల్లోనూ ఇదే పరిస్థితి ఉందని ఓ అధ్యాపకుడు ఇంటర్మీడియట్ బోర్డు డైరెక్టర్, అధికారులకు ఫిర్యాదు చేసినట్లు సమాచారం. ఈ విషయాన్ని జిల్లా ఇంటర్మీడియట్ అధికారితోపాటు ఇతర అధికారులు బయటకు రాకుండా కప్పిపుచ్చే ప్రయత్నం చేస్తున్నారు.

నల్లగొండ జిల్లా కేంద్రంలోని కోమటిరెడ్డి ప్రతీక్ మెమోరియల్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ మూల్యాంకనం జరుగుతున్నది. కాగా, పేపర్ వాల్యూయేషన్ బాధ్యతలు జూనియర్ కళాశాలల అధ్యాపకులకు అప్పగిస్తూ గురుకుల, మోడల్ స్కూల్ అధ్యాపకులు, సీనియర్ ఉన్నా వారికి అవకాశం ఇవ్వడం లేదని తెలుస్తున్నది. మూల్యాంకనం కేంద్రంలో కనీస మౌలిక వసతులు కూడా కల్పించడం లేదని, మంచినీళ్లు కూడా ఇంటి నుంచి తెచ్చుకోవాల్సి వస్తున్నదని పలువురు అధ్యాపకులు వాపోతున్నారు. గతంలో పేపర్ దిద్దడానికి పెన్నులు, పెన్సిల్స్ ఇతర సామాగ్రి ఇచ్చేవారు. ఈసారి అవి కూడా అందించడం లేదు. కనీసం రూమ్ శుభ్రంగా ఉంచడం లేదని, టాయిలెట్లు అధ్వానంగా ఉన్నాయని పలువురు వాపోతున్నారు. ప్రశ్నించిన అధ్యాపకుల పట్ల అధికారులు దురుసుగా ప్రవర్తిస్తున్నారని మూల్యాంకనం కేంద్రం వెలుపల పలువురు అధ్యాపకులు చర్చించుకుంటున్నారు. సంబంధిత స్పాట్ వ్యాల్యూయేషన్ కేంద్రం అధికారులు, డీఐఈఓకు చెప్పినా పట్టించుకోవడం లేదని వాపోతున్నారు.

బోర్డుకు ఫిర్యాదు..

నల్లగొండ ఇంటర్ స్పాట్ వాల్యూయేషన్ కేంద్రంలో చీఫ్ ఎగ్జామినర్లు, సబ్జెక్ట్ ఎక్స్ విధులు సక్రమంగా నిర్వహించడం లేదని, మౌలిక వసతులు లేవని, పరిశుభ్రత పాటించడం లేదని, ఇష్టారాజ్యంగా అధికారులు వ్యవహరిస్తున్నారని తాజాగా ఇంటర్మీడియట్ బోర్డు పరీక్షల నియంత్రణ అధికారితోపాటు బోర్డు అధికారులకు సబ్జెక్టు మూల్యాంకనం చేసే అధ్యాపకుడు ఒకరు ఫిర్యాదు చేశారు. దాంతో వాల్యూయేషన్ కేంద్రం బాధ్యులపై బోర్డు అధికారులు సీరియస్ అయినట్లు తెలిసింది. కాగా, ఈ విషయమై నల్లగొండ డీఐఈఓ దస్రూనాయక్ ను నమస్తే తెలంగాణ వివరణ కోరగా.. మూల్యాంకనం విధులను వివిధ హోదాల్లో సీనియారిటీ ప్రకారం బోర్డు నిబంధనలు పాటిస్తూ కేటాయించినట్టు తెలిపారు. కొన్ని సబ్జెక్టుల్లో సీనియర్లు లేనప్పుడు జూనియర్లకు అవకాశం కల్పిస్తానన్నారు. మూల్యాంకనం కేంద్రంలో అందరూ సక్రమంగా పని చేస్తున్నారని, అన్ని వస్తువులు కల్పిస్తున్నామని పేర్కొన్నారు.

సూర్యాపేట ఈద్‌గాహ్‌లో ముస్లిం మత పెద్దలకు రంజాన్ శుభాకాంక్షలు తెలుపుతున్న మాజీ మంత్రి, ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి, చిత్రంలో మాజీ ఎంపీ బడుగుల లింగయ్యయాదవ్

భక్తిశ్రద్ధలతో ఈద్ ఉల్ ఫితర్

- ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా రంజాన్ వేడుకలు
- ఈద్ గాహ్ లు, మసీదుల వద్ద ప్రత్యేక ప్రార్థనలు
- సూర్యాపేటలో పాల్గొని ముస్లింలకు శుభాకాంక్షలు తెలిపిన మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి

సూర్యాపేట టౌన్, మార్చి 31: ముస్లింల అతి పెద్ద పండుగైన రంజాన్ ను ఉమ్మడి జిల్లావ్యాప్తంగా సోమవారం భక్తిశ్రద్ధలతో జరుపుకొన్నారు. తెల్లవారుజామునే ఫజర్ నమాజ్ ఆచరించారు. శక్తి మేరకు ఫిత్రా చెల్లించారు. అనంతరం ఈద్ గాహ్ లు, మసీదులకు వెళ్లి సామూహిక ప్రార్థనల్లో పాల్గొన్నారు. నల్లగొండ జిల్లా కేంద్రంలోని మునుగోడు రోడ్డులో గల ఈద్ గాహ్ కు మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి వెళ్లి శుభాకాంక్షలు తెలిపారు. మాజీ మంత్రి, ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్ రెడ్డి సూర్యాపేటలోని ఈద్ గాహ్ కు చేరుకుని పండుగ శుభాకాంక్షలు తెలిపారు. జిల్లా కేంద్రానికి చెందిన బీఆర్ఎస్ నాయకులు షేక్ మస్తాన్ వలీ, ఎస్ కే రఫీతో పాటు పలువురి నివాసాలకు వెళ్లి వారి ఆతిథ్యాన్ని స్వీకరించారు. బీఆర్ ఎస్ మహిళా నాయకురాలు సల్మా మస్తాన్ ఖీర్ తీసుకొచ్చి క్యాంపు కార్యాలయంలో మాజీ మంత్రి జగదీశ్ రెడ్డికి అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భిన్నత్వంలో ఏకత్వానికి తెలంగాణ ప్రతీక అన్నారు. అందుకు తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ తీసుకున్న నిర్ణయాలు దోహదపడ్డాయన్నారు. యావత్ సమాజం సుఖ సంతోషాలతో వర్ధిల్లాలని, పాడి పంటలు సమృద్ధిగా పండాలని కోరుకుంటూ శాంతి, సామరస్యాలు పరిఢవిల్లాలన్న సంకల్పంతో నెల రోజులు కఠోర ఉపవాస దీక్ష పాటించిన వారికి అల్లా మోక్షం కలిగిస్తారనే విశ్వాసం ఉందన్నారు. బతుకమ్మ, రంజాన్, క్రిస్మస్ పండుగలను అధికారికంగా నిర్వహించేలా చేసిన దార్శనికుడు మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ అని గుర్తు చేశారు. కార్యక్రమంలో మాజీ రాజ్యసభ సభ్యుడు బడుగుల లింగయ్యాదవ్, జిల్లా గ్రంధాలయ సంస్థ మాజీ చైర్మన్ నిమ్మల శ్రీనివాస్, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ పుట్ట కిశోర్, మాజీ జడ్పీటీసీ జీడి భిక్షం, మాజీ ఎంపీపీ నెమ్మాది భిక్షం, బీఆర్ రాష్ట్ర కార్యదర్శి వై.వెంకటేశ్వర్లు, మైనార్టీ సెల్ నాయకులు సయ్యద్ సలీమ్ , జలీల్ రియాజుద్దీన్, సయ్యద్, షకీల్, నాయకులు ఉప్పల ఆనంద్, మొరిశెట్టి శ్రీనివాస్, రఫీ, మస్తాన్ వలీ, బత్తుల రమేశ్, ఆకుల లవకుశ, బత్తుల జాన, అనిల్ బింగి రేణుక, నిమ్మనగోటి వెంకన్న పాల్గొన్నారు.

కిష్టాపురంలో ఇరువర్గాల ఘర్షణ

- పలువురికి గాయాలు.. ఇండ్లు, బైకులు ధ్వంసం

చింతలపాలెం, మార్చి 31: ఇరువర్గాల మధ్య ఘర్షణ తలెత్తి పలువురికి గాయాలైన ఘటన మండలంలోని కిష్టాపురం గ్రామంలో ఆదివారం సాయంత్రం చోటుచేసుకుంది. డీఎస్పీ శ్రీధర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. కిష్టాపురం గ్రామంలో క్రికెట్ ఆడుతున్న సమయంలో ఇద్దరు యువకుల మధ్య నెలకొన్న వివాదం గ్రామంలో ఇరువర్గాల ఆధిపత్య పోరుకు దారితీసింది. ఈ నేపథ్యంలో ఇరువర్గాలు చేసుకున్న పరస్పరదాడుల్లో గ్రామంలోని పలువురి ఇండ్లు, బైకులు ధ్వంసం కాగా కొందరికి గాయాలయ్యాయి. ధ్వంసమైన ఇండ్లను, బైకులను సోమవారం డీఎస్పీ శ్రీధర్ రెడ్డి పరిశీలించారు. ఇరువర్గాలకు చెందిన 20 మందిపై కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు తెలిపారు. గ్రామంలో శాంతిభద్రతలు అదుపులోకి వచ్చే వరకు పోలీస్ పికెట్ నిర్వహిస్తామని తెలిపారు. శాంతి భద్రతలకు ఎవరైనా విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. డీఎస్పీ వెంట కోదాడ రూరల్ సీఐ రజితారెడ్డి, ఎస్ఐ అంతిరెడ్డి, పోలీస్ సిబ్బంది ఉన్నారు.



గ్రామంలో విచారణ చేపడుతున్న డీఎస్పీ శ్రీధర్‌రెడ్డి